ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ

మియాపూర్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైనా రూ. 59,06,884ల ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపేనా 59 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్లు దానం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ...అర్హులైనా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, చాంద్‌పాషా, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తేవొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పటాన్‌చెరు టౌన్: అదనపు విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు కొన్ని మినహాయింపులు కల్పించాలని సోమవారం ఎంపీడీఓ, ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా దానిని నిర్వహించే క్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముందుంటారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, వాటిని ఆన్‌లైన్ చేయించడం , వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం, ఇంటింటి నల్లా సర్వే, ఎల్ఆర్ఎస్ సర్వే, ఇటీవలే నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలో కీలకమైన పాత్ర నిర్వహించి ఎన్యుమరేషన్ విధులు, డేటా ఎంట్రీ ఇలా ఎన్నో పనుల విజయవంతంగా చేశామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కవిత, జ్యోతి, సుభాష్, మౌనిక, రాజేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మూసాపేట జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్ రావు దాదాపు అన్ని కాలనీలు, బస్తీల్లో, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ చాలావరకు దెబ్బ తిన్నాయని, కొన్ని ప్రదేశాల్లో వీధిలైట్లు కూడా లేవని, పరిసరాలు సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభించి ప్రజలు, చిన్నారులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మణిభూషణ్, రామరాజు, నరేందర్ రెడ్డి, కుమార్‌యాదవ్, వెంకటస్వామి రెడ్డి, అరుణ్ కుమార్, గోపాల్‌రావు, బాలు యాదవ్, రాజిరెడ్డి, కృష్ణంరాజు, ఎత్రి రమేశ్‌రాయల్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా 'దీక్షారంభ్'



దీక్షారంభ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఉద్యాన కళాశాలలో బీఎస్సీ హార్టికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం సోమవారం దీక్షారంభ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థుల్లో నైపుణ్యాల వృద్ధికి నూతన విద్యావిధానంలో చేర్చిన అంశాలను వివరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని హార్టికల్చర్ విభాగం డీన్ డాక్టర్ రాజశేఖర్ ప్రారంభించారు. విద్యార్థులకు తరగతిలో చదువుతోపాటు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషిలో భాగమే ఈ దీక్షారంభ్ కార్యక్రమం అని ఆయన వివరించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కాలానుగుణంగా హార్టికల్చర్ విభాగంలో వచ్చే ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకొని రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉద్యాన విద్య తర్వాత సొంత వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. ప్రధానంగా మొక్కల నర్సరీల ఏర్పాటు, మొక్కల కుండీల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, బయో పెస్టిసైడ్స్, ల్యాండ్ స్కేపింగ్ వంటి వాటిని స్థాపించి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మంజూరైన ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి పేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన గంగాధర్‌రెడ్డి, కుమారుడు సాయికిరణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ద్వారా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో 2 లక్షల 50వేల రూపాయల ఎల్ఓసీ అనుమతి పత్రం మంజురయింది. సోమవారం ఎమ్మెల్యే బాధిత బాలుడి తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, దేవానంద్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు అంతిరెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

మణికొండ: నాలగో వార్డులోని పెండిగ్ పనులను సత్వరమే పూర్తి చేయించాలని కౌన్సిలర్ ఎల్.వందన నగేష్ ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలు మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌లను కోరారు. సోమవారం వారు హుడాకాలనీలో పలు చోట్ల వరద నీరు చేరి ఇబ్బంది అవుతుందని, అంబేడ్కర్ పార్కులోని కమ్యూనిటీహాల్ మరో అంతస్తు నిర్మించాలని, అబ్దుల్ కలాం పార్కు, ఎంజీ పార్కుల పనులను కొనసాగించాలని, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. భాగ్యలక్ష్మి కాలనీలో సీసీ రోడ్లు వేయాలని, ఓపెన్ జిమ్ మరమ్మతులు చేపట్టాలని, కోతుల బెడదను పరిష్కరించాలని కోరారు. హుడా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఉపాధ్యక్షుడు వాహీద్‌ఖాన్, కోశాధికారి వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సొంత వైద్యం వద్దు..

వైద్యుల సూచనలు పాటిస్తేనే ఆరోగ్యం
హఫీజ్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషా





హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చందానగర్: రోగులు సొంత వైద్యం చేసుకోవద్దని.. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని హఫీజ్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషా పేర్కొన్నారు. 'ప్రైవేట్ ఆస్పత్రులలో ఓపీ బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటే ప్రభుత్వ ప్రాథమిక, బస్తీ దవాఖాలకు రండి మేము అవసరం ఉంటేనే పరీక్షలు చేస్తాం. తప్పదు అనుకుంటే ఆస్పత్రిలో చేరాలని సూచిస్తాం. మీకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిలోఫర్, గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులకు మేమే రెఫర్ చేసి పంపిస్తాం. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రభుత్వ ఆస్పత్రులు, బస్తీ దవాఖాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజూ సుమారు 100 మందికి నెలకు 2500 మందికి వైద్య పరీక్ష చేస్తున్నారు' అని హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అనూషా పేర్కొన్నారు. ఆయా విషయాలపై ఆమెతో 'సాక్షి' ఇంటర్వ్యూ...

సాక్షి: వైద్యులను సంప్రదించకుండా యాంటీ బయాటిక్స్ వాడొచ్చా?

డాక్టర్ అనూషా: డాక్టర్ చీటీ లేకుండా ఏ మెడికల్ షాపులో యాంటీబయాటిక్స్ అమ్మకూడదు. జర్వం, జలుబు, దగ్గు వంటివి ఒకటి, రెండు రోజులు కూడా చూడకుండానే కొందరు ముందు జాగ్రత్త పేరుతో యాంటీ బయాటిక్స్, వాడుతున్నారు. ఇది ఒక్కోసారి ప్రాణాల మీదకు తీసుకొస్తుంది. మందులు వాడేటప్పుడు ఆ జబ్బు తీవ్రతను బట్టి వైద్యులు ఏ మందులు వాడాలి.. ఎన్ని రోజులు వాడాలి, అప్పటికీ తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకోవాలనేది నిర్ణయిస్తారు. సొంతంగా యాంటీ బయాటిక్స్ వాడటం సరికాదు.

సాక్షి: డాక్టర్ల కంటే ఆర్ఎంపీలే జబ్బు త్వరగా తగ్గిస్తున్నారనం నిజమేనా?

డాక్టర్ అనూషా: రోగిని చూసి.. పరీక్షించి మందులు ఇస్తాం. యాంటీబయాటిక్స్ వాడకుండానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. ఆర్ఎంపీలు ఇష్టారీతిన వ్యవహరించడం సరికాదు. వారికి ఉన్న పరిమితులు లోబడి వైద్య సేవలు అందించాలి. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ఉచితంగా సేవలు పొందవచ్చు. డాక్టర్ ఫీజు ఉండదు. మందులు కొనాల్సిన అవసరం ఉండదు.

సాక్షి: రోగులకు కౌన్సిలింగ్ వల్ల సత్ఫలితాలు వస్తున్నాయా?

డాక్టర్ అనూషా: రోగి చరిత్ర తెలుసుకోకుండా మెడిసిన్ రాసిస్తే అప్పటి వరకు ఓకే. కానీ అది శాశ్వత పరిష్కారం చూపదు. రోగి కుటుంబం , నివాసముండే ప్రాంతం, పని విధానం తెలుసుకుంటే ఆ జబ్బు ఎందుకు వస్తుందనేది తెలుసుకోవచ్చు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికీ జాగ్రత్తలు పాటించమని సూచిస్తున్నాం.

సాక్షి: ఏ వయస్సు వారు మధుమేహం, హైపర్ టెన్షన్ పరీక్షలు చేయించుకోవాలి?

డాక్టర్ అనూషా: ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం, హైపర్ టెన్షన్ సహజం అయ్యాయి. చిన్న పిల్లలు కూడా వీటి బారిన పడుతున్నారు. కనీసం 30 సంవత్సరాలు నిండిన పురుషులు, స్త్రీలు పరీక్షలు చేయించుకుంటే మంచిది. ఇవే కాకుండా థైరాయిడ్, ఆస్తమా, కొలెస్ట్రాల్ కూడా ఎక్కువ మందిలో కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ రోజువారీగా ఆరోగ్య పరంగా మార్పులు వచ్చినప్పుడు వెంటనే జనరల్ ఫిజీషియన్‌ను సంప్రదించాలి.

సాక్షి: వ్యాధులకు దూరంగా ఉండాలంటే రోగులకు మీరు ఇచ్చే సలహాలు?

డాక్టర్ అనూషా: రోజూ వ్యాయామం, గోరు వెచ్చని నీరు ఉదయం సమయంలో తాగడం వలన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారు. ఎక్కువగా ఆకుకూరలు, పండ్లు తీసుకుంటే మంచి ఆరోగ్యానికి చాలా మంచిది.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 10న (నేడు) భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

కంప్యూటర్ల అందజేత

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాలకు సోమవారం వ్యాపారవేత్త కోటేశ్వరరావు ఆరు కంప్యూటర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం మరింత పెంచాలన్న లక్ష్యంతో తన వంతు బాధ్యతగా కంప్యూటర్లు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచే కంప్యూటర్‌పై విద్యార్థులకు శిక్షణ అందిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఇందిరమ్మ గృహాలకు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించటం శుభపరిణామని, వాటిని అర్హులకు మాత్రమే కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు పి.రూపారెడ్డిలు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా సమావేశం నిర్వహించి అందరికీ తెలిసేలా ఎంపిక చేయాలన్నారు. ఎంపికలో ఎలాంటి వివక్షకు పాల్పడినా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

మణికొండ: ఓ ఫంక్షన్ హాల్‌ను తమ అనుచరులతో కలిసి కూల్చివేయటం, అద్దెకు ఉంటున్న వారితో పాటు వాచ్‌మెన్‌ను బెదిరించి దోపిడీ యత్నం చేసిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... హైదర్‌షాకోట్‌లోని సాయిరాంనగర్ కాలనీలో ఉన్న ఏపీడీ ఫంక్షన్‌హాల్ స్థలాన్ని అహల్యసింగ్ లీజుకు తీసుకున్నారు. ఆదివారం దాన్ని ఖాళీ చేయాలని గంధంగూడకు చెందిన హరీష్‌గౌడ్, సాయిరాం కాలనీకి చెందిన రాంప్రసాద్‌రావులు వారిపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన చంద్రశేఖర్ బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 8వ తేదీన చంద్రశేఖర్ భార్య అహల్య ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి సురభికాలనీ ప్రైమరీ స్కూల్‌లో డాక్ ఆన్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ రాగం మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ బసవరాజు, వార్డు మెంబర్ శ్రీకళ, స్కూల్ హెచ్ఎం పాండురంగారెడ్డి, నాయకులు దేవదాస్, అశ్రఫ్, కొయ్యాడ లక్ష్మణ్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురభికాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న 'ఐయామ్ ఫినోమ్-24'



ఫినోమ్ అధ్యక్షుడు, సీఓఓ హరి బాయిరెడ్డి


గచ్చిబౌలి: ఐయామ్ ఫినోమ్-2024 పేరిట ఫ్లాగ్‌షిప్ ఇంటలిజెంట్ ఎక్స్‌పీరియన్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్లు ఫినోమ్ అధ్యక్షుడు, సీఓఓ హరి బాయిరెడ్డి తెలిపారు. సోమవారం గచ్చిబౌలిలోని ఫినోమ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏఐ దిగ్గజం ఫినోమ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో ఐయామ్ ఫినోమ్ పేరిట ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్నోవేషన్‌కి అపార అవకాశాలున్నాయన్నారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ఉద్యోగ నియామం నుంచి రిటెన్షన్ వరకు సహకారం అందిస్తామన్నారు. హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూర్‌తోపాటు దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ట్రైడెంట్‌లో జరిగే సదస్సుకు దేశ వ్యాప్తంగా ఐటీ, హెచ్ఆర్ విభాగానికి చెందిన 600 మంది నిపుణులు పాల్గొంటారని చెప్పారు. కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెలిపారు. టాప్ ఎంటర్‌ప్రైజెస్‌ల సక్సెస్, టాలెంట్ డెవలప్‌మెంట్, కెరీర్ పాత్ మ్యాపింగ్, ఏఐ డీప్‌డైవ్ సెషన్లు ఉంటాయన్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీ సంస్థల అవసరాలను తీర్చడంలో కీలకంగా మారుతుందన్నారు.

వరకట్న వేధింపులకే వివాహిత బలి

భార్య మరణానికి కారణమైన భర్త రిమాండ్

మియాపూర్: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని మియాపూర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాణిక్యం సమాచారం మేరకు... కర్ణాటక రాష్ట్రం కలబురిగి జిల్లా కోడ్ల గ్రామానికి చెందిన బోవి జగన్నాథ్‌కు వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌కు చెందిన కావేరితో 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గతంలో జగన్నాథ్ బెంగుళూర్, పుణేలో డ్రైవర్‌గా పనిచేసి అక్కడ నుంచి మియాపూర్‌కు వచ్చి నడిగడ్డతండాలో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. జగన్నాథ్ మద్యానికి బానిస కావడంతో అప్పులు అధికం అయ్యాయి. దీంతో రోజూ భార్య కావేరితో అదనపు కట్నం తీసుకురావాలని గొడవపడుతూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. కొంత కాలం క్రితం రూ. 2 లక్షలు ఇచ్చి ఆటోను కొనుగోలు చేయించారు. అయినా జగన్నాథ్ తన ప్రవర్తన మార్చుకోకుండా మరలా అదనపు కట్నం తీసుకురావాలని తరచూ గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైనా కావేరి అదే రాత్రి వారు ఉంటున్న రేకుల గది పై కప్పునకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కావేరి మృతికి భర్త వరకట్న వేధింపులే కారణమని బంధువులు ఆరోపించారు. పెళ్లి సమయంలో ఐదు తులాల బంగారం, నగదు ఇచ్చిన పెళ్లి చేసినా మరలా రూ. రెండు లక్షలు ఇచ్చి ఆటో ఇప్పించినా కూడా మరలా అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తూ వచ్చాడు. మరో అమ్మాయితో సంబంధం పెట్టుకుని మా అమ్మాయి ఆత్మహత్య చేసుకుని మరణానికి కారణమైయ్యాడని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. జగన్నాథ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఎంటమాలజీ సిబ్బందితో కలిసి సోమవారం డ్రోన్ యంత్రం సహాయంతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా బాధ్యతగా తమ ఇంటి పరిసరాలు, చెరువులు, కుంటల వద్ద చెత్తాచెదారం వేయకుండా, ఉదయం ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య ఆటో సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి శివరాజ్‌గౌడ్, వెంకటరెడ్డి, రాజు గౌడ్, నరసింహులు, ఎంటమాలజి సూపర్‌వైజర్ డీ నరసింహులు పాల్గొన్నారు.

నేడు ఏబీవీపీ గ్రేటర్ సదస్సు

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గ్రేటర్ హైదరాబాద్ సదస్సును మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారని ఏబీవీపీ సెంట్రల్ యూనివర్శిటీల జాతీయ కన్వీనర్, హెచ్‌సీయూ శాఖ అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. ఈ సదస్సును నగరంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తారన్నారు. సదస్సులో పెద్ద సంఖ్యలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పెద్ద సంఖ్యలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు సదస్సుకు తరలివెళ్లారన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లోని పార్కు స్థలాన్ని కాపాడాలని జనం కోసం సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని సమర్పించాచారు. 134, 135, 136 సర్వే నంబర్లలో పార్కు స్థలం ఉందని, ఈ స్థలంపై హైకోర్టులో రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా దొంగ పట్టాలు, దొంగ రిజిస్ట్రేషన్లు, దొంగ అనుమతులను ఇచ్చి అంజయ్యనగర్ పార్కు కబ్జాకు కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు భారీ ముడుపులతో అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. జనం కోసం సంస్థ ఈ విషయంపై ఫిర్యాదు చేసినా నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే చొరవ తీసుకొని స్థలాన్ని పరిశీలించి కబ్జాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె



వినతిపత్రాన్ని ఇస్తున్న ఎమ్మార్సీ ఉద్యోగులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగుతున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామికి సోమవారం ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మార్సీ ఉద్యోగులంతా నిరవధిక సమ్మెబాట పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాస్, వేణు, రజిత, భాస్కర్ మెసెంజర్ కృష్ణ పాల్గొన్నారు.

అపోలో ఫార్మసీలో చోరీ

గచ్చిబౌలి: అపోలో ఫార్మసీలో చోరీ జరిగిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని అపోలో ఫార్మసీలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి రూ. 2 లక్షల నగదు చోరీ చేశారు. ఫార్మసీ వెనుక భాగంలో ఉన్న కిటికీని తొలగించి లోపలికి ప్రవేశించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సమీప ప్రాంతాలలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అపోలో ఫార్మసీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని.. క్వారీలో దూకి యువకుడి ఆత్మహత్య

గచ్చిబౌలి: క్వారీలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. డ్యూటీ సరిగా చేయడం లేదని పనిలోంచి తీసివేయడంతో కస్నెటి దుర్గా ప్రసాద్(21) అనే యువకుడిని ఆయన తల్లి మందలించింది. దీంతో మసీద్‌బండ ఇంట్లో నుంచి ఈ నెల 7న చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతని కోసం సమీప ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. తండ్రి అప్పారావు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మసీద్‌బండలోని ఓ క్వారీ గుంతలో దుర్గా ప్రసాద్ ఓ మృతదేహం తేలిందని స్థానికులు సోమవారం గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో నుంచి వెళ్లిన రోజే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దుర్గంధ భరితంగా ప్రధాన రోడ్లు

మణికొండ: మణికొండ మున్సిపల్ కేంద్రం నుంచి ఔటర్ సరీ్వసు రోడ్డుకు చేరుకునే ప్రధాన రోడ్లన్నీ దుర్గంధ భరితంగా తయారయ్యాయి. నిత్యం వేలాది వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆయా రోడ్లకు ఇరువైపులా వేసిన చెత్తాచెదారం ఇతర వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. రోజూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ జీ-సర్కిల్ నుంచి ఔటర్ సర్వీసు రోడ్డు, పుప్పాలగూడ బీరప్ప దేవాలయం నుంచి ఔటర్ సర్వీసు రోడ్డుకు మధ్య కనెక్టింగ్ రోడ్డు ప్రారంభించారు. దాంతో ఐటీ ఉద్యోగులతో పాటు ఇతర పనులపై వెళ్లే వారు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. వాటిని నాటినా ఆలనా, పాలనా లేకపోవటంతో అవన్నీ ఎండిపోయాయి. దాంతో రోడ్లకు ఇరువైపులా రాత్రి సమయాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు తెచ్చి పారబోస్తున్నారు. దాంతో ఆయా రోడ్లు డంపింగ్ కేంద్రాలుగా మారిపోయాయని, అటువైపుగా మణికొండలోకి వచ్చే వారు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడ చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



చెత్త కుప్పలతో అపరిశుభ్రంగా మారిన రోడ్లు